# పండగ

రాత్రి ఎనిమిది గంటలయి వుంటుంది. ముందు గదిలో కూర్చుని ఏదో మెడిసన్‌కు సంబంధించిన పుస్తకం స్టడీ చేస్తున్నాను. అప్పటికి నేను ప్రాక్టీసుపెట్టి ఏడాదికి మించలేదు. కష్టపడి పనిచేసే స్వభావం నాది. అందువల్ల యీ సంవత్సర కాలంలోనే చాల వరకూ పేరు సంపాదించు కున్నాను. ఇంకా పైకి వస్తానని నమ్మకం వుంది.

హఠాత్తుగా దూరంగా ఒక మూలుగు వినిపించింది. అది బాధతో కూడినదని గ్రహించాను. ఎవరో కొడుతున్నట్టు కూడ అస్పష్టంగా వినిపించింది. నాది చాల జాలిగుండె. భయస్థుడిని కూడ. ఏమయినా అంత రాత్రిప్పుడు అలా దెబ్బలు, మూలుగు వినిపిస్తుంటే వింటూ వూరుకోలేక పోయాను. గబగబ టార్చిలైటు తీసుకుని బయటకు వచ్చాను చీకట్లో. అప్పటికి యింకా ఎలక్‌ట్రిక్ లైట్లు మా వూళ్ళో వెలియలేదు. అందువల్ల టార్చిలైటు కాంతిలో ఆ చప్పుడు వినవస్తున్న వయిపు నడిచాను.

ఆ ప్రదేశం చేరుకున్నాను. మాకు పాలు పోసే వాడిని ఎవరో నూతనవ్యక్తి పట్టుకుని బాదుతున్నాడు. అంత ఘోరం జరుగుతుంటే చుట్టు ప్రక్కల ఎవరూ మనుష్యులు లేకపోవడం ఆశ్చర్యం కలిగించింది. నేనే ధైర్యం చేసుకుని విడదీయ ప్రయత్నించాను.ఆ సమయంలో పుణ్యానికి పోతే పాపమెదురయి నట్లయింది నా స్థితి. ఏదో వారిని విడదీయాలని తలుస్తే కొడుతున్న వ్యక్తి

కాస్తా నామీద విరుచుకు పడ్డాడు. వాడి ఆకారం చూస్తే తాగి వచ్చిన వాడిలా వుంది. నేను ఎవరయిందీ తెలుసుకోకుండా మాటలు మిగిలాడు. అంత రాత్రిప్పుడు అసలే పిరికి వాడ్నయిన నేను, వాడిని ఎదురించటానికి సాహసించలేదు. వాడు ఏదో తిట్టుకుంటూనే తూలిపోతూ వెళ్ళిపోయాడు.

"ఏమిటి వీరన్నా అసలు సంగతి. ఎందుకు వాడు నిన్ను కొట్టటం ?" అని అడిగా దెబ్బలుతిని పడివున్న పాలవాడిని.

"ఏముందిబాబూ, యిద్దరం ఎప్పుడో మాటామాటా అనుకున్నాము. ఇప్పుడు తాగివచ్చి చావబాదాడు" అని చెప్పాడు ఏడుస్తూ. నాకు వాడి దౌర్జన్యం అర్థంకాలేదు, అమాయకుడయిన వీరన్నని చావగొట్టాడే అని విచారించాను. ఆ వూళ్ళో అంతోయింతో పేరున్న నాకు అలాంటి అల్కాజాతి వాడిచేత మాటలనిపించు కున్నామే అని విచారం గలిగింది. దానికి చేయదగ్గ ప్రతీకారం ఏమిటా అని ఆలోచించాను యింటికొచ్చిన తర్వాత. కొంచెంసేపు గడచిం తర్వాత పోలీసు రిపోర్టు యిద్దామా అనుకున్నాను. గౌరవనీయులు చేయవలసిన పని అదేనని తలిచాను.

మరునాడు ప్రొద్దున్నే పోలీసు స్టేషన్‌కు వెళ్ళాను. జరిగినదంతా రిపోర్టు వ్రాశాను. సరే పోలీసులను పంపించి వాడిని రప్పిస్తామని నన్ను వెళ్ళిపొమ్మన్నారు. సరేనని యింటికి వచ్చేశాను.

ఆ సాయంత్రం ఒక పోలీసు వచ్చి అతని యింటికి వెళ్ళామనీ, యింట్లో ఎన్నిసార్లు వెళ్ళినా వుండటం లేదనీ ఏవేవో మిణికాడు. అయితే నేనామాత్రం గ్రహించలేనా ? పదో పదిహేనో లంచం మింగుంటారు. ఏదో కోస్తున్నారు. నాకు అనవసరంగా ఏ గొడవల్లోకి దిగటం యిష్టం వుండదు. పోనీలే ఏదో అయిపోయిందేదో అయిపోయింది పూరుకుందామనుకున్నాను.

ఆ సంగతి అంతటితో సమసిపోతే బాగుండునా ? రెండు రోజుల తర్వాత వాడు అంటే వీరన్నను కొట్టినవాడు బజార్లో కనిపించాడు. వాడిజోలి మనకెందుకని నా దారిని నేను పోతున్నాను. ఆ పోతున్నవాడు పోవచ్చునా ? చిన్న కృత్రిమ దగ్గు దగ్గాడు. అప్రియత్నంగా వాడి వయిపు చూశాను. వాడు నావంక విజయగర్వంతో చూసి మీసం మెలేశాడు. నా మనస్సు చివుక్కుమంది. నౌకరీ చేసేవాడికి అంత టెక్కు వుంటే నా కెంత వుండాలి. వీడికెలాఅయినా తగిన బుద్ధి చెప్పాలి. ఏం చెయ్యాలి చెప్మా ? నాకు చటుక్కున గురువులు జ్ఞాపక మొచ్చాడు. గురువులంటే ఎవరో కాదు. నాకు తెలిసిన మనిషే. వాడిలాంటి రౌడీ మా వూళ్ళో ఎవడూ లేడు. వాడిపేరు చెప్తే అందరికీ హడల్. రెండు మూడు ఖూనీలు చేశాడని చెప్పుకుంటారు. అది నిజమే అయివుండవచ్చు. ఆరోజు గురువులుకు కబురంపించాను. వాడికీ నాకూ పెద్ద పరిచయం మేదీలేదుగాని అప్పుడప్పుడు నాదగ్గిర మందుతింటూ వుండేవాడు అంతే.గురువులు వచ్చాడు. "అక్కడ కూర్చోవోయ్" అన్నా. 'ఏమిటి బాబూగారూ కబురంపించారు. ఏటి విశేషం" అన్నాడు కూర్చుంటూ.

"ఏమీలేదు గురువులూ ! అవతల సందులో మల్లయ్య లేడూ, వాడు నాగురించి అమర్యాదగా సంచరించాడు. వాడికి తగినట్లు బుద్ధి చెప్పాలి. ఈ భారం నీమీదే వేశాను మరి" అన్నాను.

"ఏటిబాబూ, మిమ్మల్ని మాటనటానికి ఎవడి కెన్ని గుండెలున్నాయి ?" అన్నాడు రోషంగా. నామీద అతని కటువంటి గురి వున్నందుకు సంతోషించాను.

"అదే గురువులూ ! ఏదో పిచ్చిపిచ్చిగా వాగాడు. ఏం చేద్దామంటావు ?"

"అదెంత పనిబాబూ, నిమిషం. వాడుకూడ ఒక లెక్కేనా ?"

"అదేమిటి గురవులూ. కొంపతీసి కపీమనిపించవుగదా. అలాటి పనిమాత్రం చెయ్యొద్దు సుమా.ఏదో వాడిని పిలిచి నాలుగు చివాట్లేసి పంపిండ్దాం" అన్నా భయంగా.

"ఎందుకు బాబుగారూ అంతభయం. నేనేం సెయ్యనులెండి. మరెప్పుడు రమ్మంటారు ?"

"రావడం ఎందుకు ? వాడినే ఇక్కడకు పిలిపిద్దాం"

"అబ్బే మనమే అక్కడి కెళ్ళాలి. మరి నేను రాత్రి కొస్తాను. ఇల్లు చూపిద్దురుగాని రెడీగా వుండండి" అంటూ వెళ్ళిపోయాడు. నిర్విణ్ణుణ్ని అయిపోయాను. కొంపతీసి ఏమీ చెయ్యిచేసుకోడు గదా. గురవులు సంగతి నాకు బాగా తెలుసు. ఎటువంటి దానికీ వెనుదీయడు.అనవసరంగా యిందులోయిరుక్కున్నాననుకొన్నాను. అయినా దెబ్బలాటేం వద్దని చెప్పానుగా. అలా చేయడులే అని కొంచెం తృప్తిపడ్డాను. ఏమయినా ఎప్పుడో ఒకప్పుడు పిలిపించేసి చివాట్లు వేయక రాత్రికి వస్తానన్నా డెందుకా ? అని మనస్సు పీకుతూనేవుంది.

రాత్రి తొమ్మిదయింది. నేను భోజనంచేసి గురవులుగాడి కోసం ఎదురుచూస్తున్నాను. మరో పావుగంట గడిచేటప్పటికి వాడుకూడా వచ్చాడు. కళ్ళు బాగా ఎర్రగా వున్నాయి. చేతిలో ఒక దుడ్డుకర్ర వుంది, "ఏం బాబుగారూ సిదంగా వున్నారా ?" అని అడిగాడు. వాడు మాట్లాడుతుంటే నోట్లోంచి గప్పున వాసన కొట్టింది. బాగా తాగివచ్చాడని అనుకున్నా.

"వున్నానుగాని, ఆ కర్రెందుకు ?" అని అడిగా.

"ఆఁ, వూరికినే వుండాలి లెండి. మరి బయలుదేరండి" అన్నాడు. నా గుండెలు దడదడ లాడాయి. సరే,యింతవరకూ వచ్చిన తర్వాత యింక జంకితే ఏమిలాభమని విధిగా గురవుల్ని అనుసరించా. ఆ

చీకట్లో అలానే మల్లయ్య యింటికి బయలుదేరాం. నాకు మల్లయ్య యిల్లు తెలుసు.

కొంత సేపటికి మల్లయ్య యిల్లు చేరుకున్నాం. గురువులుగాడి కా యిల్లు చూపించి నేను యివతలగా నిల్చున్నాను.గురువులు ఆయింటి తలుపులు కొడుతూ 'అన్నయ్యా, అన్నయ్యా' అని పిలిచాడు. వాడి యుక్తికి ఆశ్చర్యం వేసింది. నే ననుకున్నానూ—మల్లయ్య బయటకు రాగానే 'ఇదుగో మల్లాయ్. డాక్టరుగారంటే ఏమిటను కుంటున్నావో, ఏదో పిచ్చి పిచ్చిగా ప్రవర్తించావుట. ఇంకెప్పుడయినా వారి జోలికి వెళ్ళావంటే నీకు తెలుసుగా మనసంగతి' అని భయపెడతాడని.

"ఎవరూ !" అని మల్లయ్యే తలుపు తెరిచాడు. వెంటనే వాడి తల ధన్ మంది. నా కాళ్ళు వణికి పోయాయి. క్రిందనున్న భూమి అంతా గిరగిరా తిరుగుతున్నట్లు అనిపించింది. గురువులు యింత ఘోరం చేస్తాడని అనుకోలేదు. తలెత్తి చూశాను. అక్కడ గురువులు వుంటేగా. ఎప్పుడు జారుకున్నాడో ఏమో, నా గుండె దడదడ లాడింది. నా కాళ్ళు నన్ను యింటికి ఎలా లాక్కొచ్చాయో ఏమిటో నాకు బొత్తిగా తెలియదు. మొత్తానికి ఎలా అయితేనేం యింటికి చేరుకున్నందుకు సంతోషించా. కాని నా కొక్కటే అనుమానంగా వుంది. అక్కడినుంచి పారిపోయి వచ్చేటప్పుడు సందు మలుపులో వున్న దీపపుస్తంభము క్రింద ఎవరో నిల్చున్నట్లు చూచాయగా గుర్తుంది.అయినా ఆ కంగారులో అప్పుడు గమనించ లేక పోయాను.

మరునాడు ప్రొద్దున్నే నవ్వుతూ వచ్చాడు గురువులు. "మొత్తానికి బలేపని చేశావు. వాడు చచ్చిపోయాడా ?" అని అడిగా కోపంగా.

"ఎందుకు బాబుగారూ అంతభయం. సావలేదులెండి ?" అని నవ్వుతూ అన్నాడు గురువులు.

"అక్కడ దీపస్తంభము దగ్గర ఎవరో నిలబడి వున్నట్టుంది గురువులూ. కొంపదీసి మల్లయ్యకు తెలిసిన వాడు కాదుగదా!" అన్నాను.

"ఏడిశాడు. మరి నాకు మందుకు డబ్బిప్పించండి బాబూ?"

"మందేమిటి?"

"తెలియదు బాబూ? మందు—మందంటే సారా యన్నమాట" అన్నాడు నవ్వుతూ. నాకు ఆశ్చర్యంతోబాటు భయంకూడా వేసింది. ఏదో వీడు యీ కాస్త సహాయం చేసినందుకు అప్పుడే డబ్బడుగుతున్నాడు. అయినా వాడు చేసిన సహాయం ఏముంది వాడి బొంద. మల్లయ్యని చావగొట్టమని చెప్పానా? కాని కాదనటానికి జంకి వాడికి అయిదురూపాయలు సమర్పించుకున్నాడు.

అయితే అనుకున్నంతా అయింది. ఆ రాత్రి మమ్మల్ని చూసిన వాడు మల్లయ్యకు సన్నిహితుడే కాబోలు. మామీద కేసు పెట్టాడు. గురువులుగాడి మూలాన కోర్టులకు కూడ వెళ్ళవలసి వచ్చిందే అని విచారించాను. అయినా తప్పేదేముంది? గురువులుమాత్రం ధైర్యంగానే వున్నాడు. అయినా వాడు భయపడడానికి అగత్యం ఏముంది? వాడి కివన్నీ అలవాటేనాయె!

రమ్మన్నప్పుడల్లా కోర్టుకు పోయివస్తూనే వున్నాను. నామీద ఏం పడుతుందో అని భయపడుతూనే వున్నాను. కాని పర్యవసానం మాత్రం అనుకూలంగానే జరిగింది. నాలాంటి గౌరవనీయుడు అలాంటి పోకిరి పనులలో దిగడని వదిలిపెట్టేశారు. గురువులుగాడి విషయం అందరికీ తెలుసు కాబట్టి వాడికిమాత్రం నలభయిరూపాయలు జుల్మానా విధించారు. ఆ డబ్బు వాడెందుకు యిస్తాడు? చచ్చినట్లు నేనే యిచ్చుకోవాలి, యిచ్చుకున్నాను.

ఆ గొడవ అంతటితో వదలిపోతే బావుండేది. ఈ గురువులుగాడు నన్ను బంకలా పట్టుకున్నాడు. రోజూ పొద్దున్నే తయారయ్యే

వాడు, మందుకోసం డబ్బివ్వమంటూ. ఇవ్వనని అనటానికి ధైర్యం చాలదు. కొంచం చూచాయగా అంటే "బాబుగారూ, మీకు చేసిన సహాయం మర్చిపోయారా ?" అనేవాడు. ఏమిటో వాడు చేసిన సహాయం. రోజూ ఒకటి రెండూ వాడికి దర్శించుకుంటూ వుండే వాడిని.

రానురాను నాకు వాడు ఒక శనిగ్రహంలాగ తయారయ్యాడు. వాడి ఆకారం చూస్తే అటువంటి ఖూనీకోరు అని ఎవ్వరూ అనుకోరు. గుప్పిటిలో యిమిడిపోయేటట్లుగా వుంటాడు. కాని ధైర్యంలోనూ, బలంలోనూ సామాన్యుడుకాడు. హాయిగా బ్రతుకుతున్నవాడిని ఈ పుండాఖోరుతో ఎందుకు పెట్టుకున్నానా అని ఎప్పుడూ చింతిస్తూ వుండేవాడిని. కాని ఈ పీడమాత్రం వదిలేమార్గం కనిపించలా.

ఒకసారి నేను ఆశ్చర్య పోయేటట్లు చేసింది ఒక సంఘటన. అదేమిటే అంటే ఒక వారం రోజులపాటు గురువులు కనపడలేదు. అందుకే ఆశ్చర్యపోవటం. ఒకరోజయినా విడవని నన్ను వారం రోజులపాటు కలియకుండా వున్నందుకు ఆశ్చర్యపడటంలో వింతేమీ లేదనుకుంటాను.ఈ విషయం ఏమిటా అని వాకబు చేశాను. అసలుసంగతి తెలిసిపోయింది. ఏమిటంటే ఈ గురువులుగాడు ఎవరినో ఖూనీ చేసేందుకు ప్రయత్నించాడట. అందువల్ల ఒక సంవత్సరంమాత్రం కారాగార శిక్ష విధించారు. ఇది విన్నతర్వాత నా ప్రాణానికి కొంత వుపశాంతి కలిగింది. కొంతకాలమయినా హాయిగా ఉంటానని సంతోషించాను. అయినా వాడు జయిలు నుండి విడుదలయిన తరువాత మళ్ళీ ఈ ప్రకారం చేస్తాడేమోనని ఒకమూల భయంగానే వుందిగాని, ఈ సంవత్సరంలో వాడికి జ్ఞాపకముండి యేడుస్తుందా అని కొంచం ధైర్యం వహించాను.

ఆ తర్వాత కొన్ని నెలలు గడిచిపోయాయి. ఒకరోజు రాత్రి అప్పుడే ఆఫీసునుండి అలసిపోయివచ్చి భోజనానికి వుపక్రమించ

బోతున్నాను. ఇంతలో ఎవరో డాక్టరుగారూ అని పిలిచారు. విసుక్కుంటూ తలుపు తీశాను. బయట చీకట్లో ఒక స్త్రీవ్యక్తి నిల్చుని వున్నది. ఆమెను చప్పునే పోల్చుకున్నాను. మరెవరో కాదు. గురువులుగాడి భార్యయే. వాడిని మించిన దుర్మార్గురాలు. ఇంతకు ముందు చెప్పడం మరిచిపోయాను నేను గురువులు గాడికి అలుసయిన దగ్గరనుంచీ వాళ్ళకి మందూ మాకు నేనే ఉచితంగా యివ్వటం.

'ఏం?' అన్నా.

"అబ్బాయికి జబ్బుగావుంది బాబయ్యా. ఒకసారి రావాలి." ఒకసారి రావాలిట. దాని మాటతీరుచూస్తే వళ్ళు మండిపోయింది. అయినా కోపాన్ని వుపసంహరించుకుని "ఇక్కడికి తీసుకురాకపోయావా?" అన్నాను.

"ఆ....అసలే జబ్బుమనిషి. మీరే రండి...." అంది ధీమాగా. గురువులుగాడికి అయితే మాత్రం దీనికికూడా లోకువయి పోయానుగా. ఇంక కోపం ఆపుకోలేక పోయాను. గురువులుమీద నున్న కసిఅంతా దానిమీద తీర్చుకున్నాను.

"ఛీ ఛీ పో. వేళకాని వేళప్పుడు రమ్మంటే ఎవరొస్తారు. అయినా ఏమిటి నీకా ధీమా.ఇంకెప్పుడూ ఇలాగా బోక. ఊ, పో.... ఇంకా నిల్చున్నావేం మొద్దులాగా" అని నాలుగు మాటలు దులిపేసి తలుపు ఛడాలున వేసుకున్నాను. దాని పుణ్యమా అని గోలచేయకుండానే వెళ్ళిపోయింది. అయినా దానిని అలా అన్నందుకు విచారం వేయలేదు కాని భయం వేసింది. ఏదో కోపంమీద అనేశానే గాని గురువులు వచ్చిన తర్వాత నా మీద లేనిపోనివి కల్పించి చెప్తుందేమోనని ఊహించలేదు.

నేను ఈ సంగతి పూర్తిగా మర్చిపోయే వుంటాను. అంటే

చాల రోజులు గడిచి పోయాయన్నమాట. ఈ కొలది కాలంలోనే నాకు ఊళ్ళో పలుకుబడి హెచ్చింది. నా జీవితం సుఖంగా దొర్లి పోతూంది. నాకు వివాహంకూడా యీమధ్యనే అయింది. అంటే కాస్త నాకు అందరికన్నా ఆలస్యంగానే అయిందిలెండి. అయినా నా వయస్సు యిరువదియేడుకు మించలేదు. ఇప్పటికి నా జీవితం ఒక దారిని పడిందని సంతోషించాను. నాకు తలిదండ్రులుగాని, దగ్గర బంధువులుగాని ఎవరూ లేరు. అందువల్లనే భార్యవయిపు బంధువులన్నా కలిసినందుకు అపరిమితమయిన ఆనందం అనుభ వించాను.

ఆ రోజున మామూలుగా ఉదయం ఏడు గంటలకు ఆఫీసు తెరిచి కూర్చున్నాను. అప్పటికి ఇంకా పేషెంట్సు ఎవ్వరూరాలేదు. నా భవిష్యత్తును తలుచుకుంటూ కూర్చున్నాను. యింకా కాంపౌం డర్సుకూడా రాలేదు. నాకున్న ఓర్పుకు, దీక్షకు నాకే గర్వం కలి గింది. ఎందుచేతనంటే మిగతా డాక్టర్లలాగ కాకుండా ప్రొద్దున్నే ఆఫీసు తెరిచి భోజనమయినా చేయకుండా మధ్యాహ్నం వరకూ యింజన్‌లాగా పనిచేస్తాను. నేను చేస్తున్న కృషికి కాంపౌండర్సే హడిలి పోతూవుండేవారు.

అడుగుల చప్పుడయితే తలఎత్తి చూశాను. తల గిర్రున తిరిగి పోయింది. ఎదురుగా నిల్చున్న వ్యక్తి ఎవరు? నా సుఖజీవి తంలో మరిచిపోయినవన్నీ గుర్తుకు తెచ్చుకున్నాను. చేతులార తెచ్చుకున్న సైతాను, శనిగ్రహం మళ్ళీ దాపురించింది.
"బాబూ" గర్జించాడు గురువులు. "బాబూ నేను చేసిన సహా యాన్ని మరిచిపోయారు కదూ. అవును. మీరు కామందులు. నేను అందరి చెప్పిన పనులూ చేస్తూ, అడ్డమయినవాళ్ళ కాళ్ళూ పట్టుకుని బ్రతికే వ్యర్థుడ్ని. మీకు మేము జ్ఞాపకం వుంటామా బాబూగారూ. ఈమధ్యే పెళ్ళికూడా అయినాది కాబోలు. అవును.

ఆ సంతోషంలో మాగోడు మీకేం తెలుస్తాది. నా కొడుకుని పొట్ట బెట్టుకుండి మీరుగాదా బాబుగారూ. ఆ రాత్రే గనక మీరువస్తే నా కొడుకు చచ్చిపోయేవాడా?" అనిధారాళపారంగామాట్లాడుతున్నాడు. నేను గజగజలాడి పోతున్నాను. ఆ భయంలోనే అనుకున్నాను. సైతాను పగబట్టింది. పగ తీర్చుకుంటుంది. ఇక యీ దీనుడికి భూమిపైన జీవించే అవకాశంలేదు. వీడిబ్రతుకు యిక గంటల్లో వున్నది.

"ఆ....అయితే....ఏ....మంటావు?" అన్నాను ఎలాగో.

"ఏమంటానా బాబూ. మిమ్మల్నేమయినా చేస్తానని జడుస్తు న్నారా? హహహ పదివేలరూపాయలు. తెలిసిందాబాబూ.నాకొడుకు ప్రాణానికి పదివేలరూపాయలు."

"పదివేలా?"

"అవును. ఆశ్చర్యంగా వుందా? ఈ సంవత్సరంలోనూయిలాంటి పదివేలు ఎన్ని సంపాదించానంటారు?"

"గురువులూ. అనవసరంగా పొరబడుతున్నావు. నీ బిడ్డడి ప్రాణా నికి నేనా బాధ్యుడ...."

"నీవు కాదూ. అమ్మో" గర్జించాడు భయంకరంగా. 'ఇదిగో చెప్తున్నాను వినుబాబూ. మీకూ నాకు తగువెందుకు. నేను పచ్చి రక్తం తాగేవాడి నన్న సంగతి అందరకూ తెలుసు. ఆ పదివేలూ యిచ్చేయండి."

అప్రయత్నంగా ఒక గుడ్డి ఉపాయం తోచింది. "అయితే వుండు" అని గురువులుగాడిని అక్కడే కూర్చోబెట్టి దొడ్డి దారిని పోలీసుస్టేషనుకు పరుగెత్తాను.

అగస్మాత్తుగా పోలీసులతో లోపలకు ప్రవేశించడం చూసి నివ్వెర

పోయాడు గురువులు. వాడిని చూసి యిన్స్పెక్టరు "నువ్వేనా నాయనా. ఘనుడివే. నిన్ననేకదూ జయిలునుండి విడుదలయింది." అని పరిహాసం చేశాడు. గురువులు మొహం చిన్నబడటానికి బదులు ఎర్ర బడింది. నావయిపు గుర్రుగా చూశాడు. లోపల భయంగావున్నా బయటికిమటుకు "చూశావా మన ప్రతిభ" అన్నట్లు చూశాను. "చూద్దువుగానిలే నాతడాఖా. అప్పుడే అయిపోందను కున్నావు కాబోలు" అన్నభావం స్ఫురించేటట్లు ఒక్కసారి తల విదిలించాడు. నాగుండెలు దడదడలాడింది. ఉన్న సంగతి దాయట మెందుకని పోలీసు యినస్పెక్టరుతో గురువులుగాడికీ, నాకూ వున్న సంబంధం యావత్తూ పూసగుచ్చినట్లు చెప్పేశాను. అది విని ఆయన "వీడిసంగతి నే చెప్తానులెండి. ఒక మూల తాటపలుస్తూ వుంటేగాని యిలాంటి వాళ్ళకు బుద్ధిరాదు" అని చిరచిర గురువులు గాడిని లాక్కుపోయాడు. పోయేటప్పుడు గురువులుగాడు చూసిన చూపు నా హృదయాన్ని దూసుకు పోయింది.

ఆ విషయం అంతటితో సమసి పోతుందని నేను పూర్తిగా నమ్మలేదు. ఎందువల్లంటే గురువులు సంగతి నేను బాగా అర్థం చేసుకున్నాను. వాడు వూరికే వదలిపోయే ఘటంకాదు. ఆ రోజు రాత్రి ఎనిమిదింటికి ఏదో కేసు వుండడంవల్ల ఆ పని చూసుకుని యింటికి వస్తున్నాను, చీకటి గాఢాంధకారంగావుంది. అలవాటయిన రోడ్డే కాబట్టి చకచకా నడుస్తున్నాను. జనసంచారంకూడా పూర్తిగ తగ్గలేదు. నావెనక ఎవరో నన్ను అనుసరించి వస్తున్నట్లు అను మానం వేసింది. కొంతదూరం నడిచాను. అనుమానం రూఢీ అయింది. తప్పక ఎవరో నన్ను వెన్నంటుతున్నారు. అసలే భయ స్థుడిని. ఏమిచేయటానికి తోచలేదు. అలాగే ధైర్యంచేసి మరో పదిగజాలు నడిచాను. జనసంచారంకూడా పల్చబడుతున్నది. వెం టాడు తున్నది ఎవరోకూడ తెలుసు నాకు. చటుక్కున వెనక్కి

తిరిగాను. ఆప్రదేశంలోనే ఒక దీపస్తంభము వుంది. అందుచేతనే సాహసించాను. నాకు పదిగజాల దూరంలో వెనక వ్యక్తి వున్నట్టు పొడగట్టింది. ధైర్యంచేసి అక్కడే నిల్చున్నాను. ఆ వ్యక్తి ఆగిపోవటానికి బదులు నా సమీపానికి వచ్చాడు. ఆవ్యక్తి యెవరో యింతకుముందే తెలుసని చెప్పాను. గురువులుగాడి తలకు గుడ్డ కట్టివుంది. రక్తపుచారలు స్పష్టంగా దీపపువెల్తురులో కనిపిస్తున్నవి. వంటిమీదకూడ అక్కడక్కడ దెబ్బలు కనిపిస్తున్నవి. ఇదంతా పోలీసువారి దెబ్బల ఫలితం అనుకున్నాను. వాడి కళ్ళు చింత నిప్పుల్లాగున్నాయి. బాగా తాగి వచ్చినట్లున్నాడు. సందేహమెందుకు వాడు మందు తీసుకోని రోజులేదు. అలాంటి స్థితిలో వాడిని చూసి హడలిపోయాను. అందులో ఆశ్చర్యం ఏముంది? ఉత్తప్పుడే వాడి పేరు చెప్తే హడలు. ఆ సమయంలో వంటరిగా వాడినుందు నిల్చోటానికి నేనేకాదు, వాడిసంగతి తెలిసిన ఎవరు సాహసిస్తారు? వాడి దగ్గర మొల్లో ఎప్పుడూ కత్తి వుంటుందన్న సంగతి నాకు బాగా తెలుసు.

"బాబుగారూ?"

"ఏం?"

"చూశారా మీరుచేసిన సహాయం. మీరు యింతటి ద్రోహం చేస్తారుటండి. ఇక్కడ నిల్చోట మెందుకు నడవండి" అన్నాడు. వాడి మాటకి ఎదురుచెప్పే శక్తి నాకులేదు. మళ్ళీ చీకటిలోపడ్డాం. నాచూపు మాత్రం వాడి మొలమీద వుంచాను. ప్రాణాలు గుప్పెటలో పెట్టుకొని నడుస్తున్నాను.

"బాబుగారూ ఇది ఆఖరుసారి చెప్పటం. మనలో మనకు విభేదాలు ఎందుకు? ఉదయం నేను కోరిన దాంట్లో సగమన్నా యిప్పించండి. మాట్లాడరేం బాబూ" అంటూ నామీద మీదకు వస్తున్నాడు. నా ప్రాణాలు ఎగిరిపోతున్నాయి. ఇవాళ నాచావు తప్పదను

కున్నా. ఆసమయంలో నా యిష్టదైవమయిన ఆంజనేయస్వామికి ఎన్ని నమస్కారాలు చేశానో?

"గురువులూ, ఇంతరాత్రప్పుడు ఎందుకూ యీబెగడ. రేపెప్పుడయినా మాట్లాడుదాం" అన్నా యెలాగో ధైర్యం చిక్కబట్టుకుని.

"రేపేంటి బాబూ, ఇప్పటికే పూళ్ళో నామీద కక్షలు ఎక్కువయ్యాయి. ఇవ్వాళ యింకోపని మిగిలివుంది" అన్నాడు ద్వంద్వార్థంగా.

"ఏమిటి?" అన్నా భయంగా.

"ఆ....అబ్బే, మీదగ్గర డబ్బుతీసుకోవడం ఒక్కటే."

"అంతేనా? సరే రేపు మాట్లాడుదామన్నాగా."

"వీల్లేదు బాబుగారూ. యిప్పుడే తేల్చుకోవాలి" అన్నాడు.

కర్కశంగా. అప్రయత్నంగా నాచూపు వాడిమొలమీదకు మళ్ళింది. వెంటనే హృదయం జల్లుమంది.

"ఏమంటారు బాబుగారూ!" ఏమంటాను? వాడికి సమాధానం చెప్పటం ఎట్లాగా అని ఆలోచిస్తున్నాను. ఇంతలో ఆసందు చివరికి వచ్చేశాము. అక్కడో దీపస్తంభమువుంది. ఇదిదాటి పది గజాలుపోతే నాపని అయిపోతుంది. నాజీవితం సమాప్తి చెందుతుంది....మరి అంతలోనాపుణ్యవశాత్తూ, అదృష్టమనే అనాలి—వెంకట్రావు అంటే నాకు దగ్గర స్నేహితుడు లెండి, ఆ దారిన పోతున్నాడు. నా హృదయంలో ఆనందం తొణికిసలాడింది.

"వెంకట్రావూ" అని పిలిచాను. అతను ఆగాడు. నేను వెంకట్రావును సమీపించాను.

"ఏమిటోయ్ యింత రాత్రప్పుడు వస్తున్నావూ" అని అడిగా. "ఏమీలేదోయ్ స్టేషనులో పనివుండటంవల్ల ఆలస్యమయింది." అని జవాబిచ్చాడు. నేను గురువులు వయిపు తిరిగి ''ఇప్పుడు నువ్వు అనేది ఏమిటయ్యా, రేపు ప్రొద్దున కనిపించు'' అన్నాను ధైర్యంగా. విధిలేక ఏదో గొణుక్కుంటూ వెనక్కి మరలి పోయాడు రౌడీవెధవ. ఆ రాత్రి మా వెంకట్రావు సహాయంతో ఇల్లు చేరుకున్నాను.

అయితే ఆమరునాడునుంచీ వారంరోజుల దాకా గురువులు వర్తమానం తెలీలేదు. మళ్ళీ ఏమన్నా జయిలుకు పోయాడేమో ననుకున్నా, కాని అసలుసంగతి తర్వాత తెలిసింది. ఆసమయంలో నేను ఎంత ఆనందం అనుభవించానో ఆ భగవంతునికే యెరుక. ఆ సాయంత్రం ఆంజనేయస్వామికి పది కొబ్బరికాయలు కొడదా మనుకున్నా. శనివిరగడయి పోయిందని సంతోషించాను. నానుండి ఏదో భారం తొలగి పోయినట్లయింది. అసలు విషయమేమిటంటే రెండురోజుల క్రితం రైల్వేస్టేషన్ దగ్గర గురువులు రక్తసిక్తమయిన దుస్తులతో చచ్చిపడిఉన్నాడట, వాడసలే ఖూనీకోరువెధవ. వాడి విరోధి ఎవరో గప్‌చిప్‌గా ఆపని చేసివుంటాడు. అన్నిటికన్నా వింతేమిటంటే పోలీసులువారుకూడా అసలు వాడి హత్య విషయం జోక్యం కల్పించుకోలేదు. అదంతా ఎందుకుగాని నేనారోజు పండుగ చేసుకున్నానంటే నమ్మండి.